క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి



సివిల్ సర్వీసెస్ జేడీ రామలింగంకు వినతి పత్రం సమర్పిస్తున్న బీటీఏ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సోమవారం ఇబ్రహీంపట్నంలోని సివిల్ సర్వీసెస్ జేడీ మొవ్వ రామలింగంను కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బీ. మనోజ్‌కుమార్ ఏలూరులో తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల్లో అన్ని క్యాడర్లలో బదిలీలకు సంబంధించి ఉన్న ఖాళీలను బ్లాక్ చేయకుండా ఖాళీలన్నీ చూపాలని కోరారు. రామలింగంను కలిసిన వారిలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా రాజేష్ ఉన్నారు.

ఏలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా కె గాయత్రి



విధుల్లో చేరిన డిప్యూటీ తహసీల్దార్ కె గాయత్రి

ఏలూరు రూరల్: ఏలూరు మండల తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా కె గాయత్రి నియామకమయ్యారు. సోమవారం ఆమె విధుల్లో చేరారు. దెందులూరు తహసీల్దార్ కార్యాలయ ఎపిక్ తహసీల్దార్‌గా పనిచేసిన ఆమె పరిపాలన బదిలీల్లో భాగంగా ఏలూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈమెకు ముందు పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ ఏలూరు కలెక్టర్ కార్యాలయ విభాగానికి బదిలీ అయ్యారు. కార్యాలయం అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పెంచిన పన్నులను ఉపసంహరించుకోవాలి

ఏలూరు (టూటౌన్): పెంచిన త్రైమాసిక రహదారి పన్నులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జె.గోపి అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు కేరళ తరహా సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. బుద్దా నాగ సూరిబాబు, చక్రాల అమర్ కుమార్, ఏ.జాను బాబు, ఎండి చాన్ భాషా పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న రైల్వేశాఖ అధికారులు, సిబ్బంది



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మొక్కలు నాటుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి



ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- మొక్కలు నాటి, అవగాహన ర్యాలీలు

ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ స్టేషన్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎన్వీ రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎ.నానాజీ, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ డి.కిరణ్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కె.నాగేశ్వరరావు, ఆర్‌పీఎఫ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెరికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

స్థానిక లంకపేట ఇజ్రాయిల్ పేటలో పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు పెరికె వరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా 200 మొక్కలను పంపిణీ చేశారు.



ఏలూరులో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది

ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో చిన్నారులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సభకు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారత స్వాగతం పలికారు. తెలుగు భాష ఉద్యమ నాయకులు వై.ఆనంద నాయుడు, ప్రముఖ చిత్రకారుడు మజ్జి కాంతారావు, ఎంజీవీఆర్ కృష్ణారావు, అజయ్ బాబు, ఎస్ గంగాభవానీ, కె.శ్రావణి,ఎం.లక్ష్మి, టి.తులసి పాల్గొన్నారు. చిత్ర లేఖనం పోటీల్లో 40 మంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఏలూరు టౌన్: భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందించే బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణకు పెద్దెత్తున మొక్కలు నాటాలని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరులోని సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో రెడ్‌క్రాస్ చైర్మన్, వలంటీర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణంలో అసమతుల్యత కారణంగా కాలుష్యం పెరిగిపోయి ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించటం, సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించటం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అనుసరించటం, అడవులు, మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించటం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బీ.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను పరిరక్షించాలి

ఏలూరు (టూటౌన్): సమాజంలో పర్యావరణ సమతుల్యతను పరిరక్షించేందుకు మొక్కలను నాటాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ కోరారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా కేంద్ర కారాగారంలో మొక్కలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నాటారు. జిల్లా జైలర్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, ప్యానల్ లాయర్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలనీ, ప్లాస్టిక్ లేని సమాజాన్ని నిర్మించేందుకు బాధ్యత తీసుకోవాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డీ.ఆశ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆశ జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పాతబస్టాండ్ సెంటర్ మీదుగా కొనసాగింది. పాతబస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద, పరిసరాల్లోనూ, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, దుకాణాల వద్ద మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ వినియోగాన్ని సాధ్యమైనంత తగ్గించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సమతుల్యత పాటించకుంటే ప్రకృతి వైపరీత్యాలు, అసమతుల్యతతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ ఏడాది ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఈ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని 1972లో ప్రారంభించారని తెలిపారు. ఈ ఏడాది 51వ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ జీ.రత్నకుమారి, ఇన్‌ఛార్జ్ ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, స్వచ్ఛంద సంస్థలు, ఆశ కార్యకర్తలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు ఘన నివాళి



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనలో రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నర్సింగ్ విద్యార్థినులు, సిబ్బంది



ఏలూరు పవరుపేట స్టేషన్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు టౌన్: ఒడిశాలో రైలు ప్రమాద దుర్ఘటనలో మృతులకు ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ వలంటీర్లు ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థినులు, అధ్యాపకులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తూ ఫైర్ స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు

ఏలూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన

మౌనంగా నిలబడి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాలసోర్ రైలు ప్రమాదం యావత్ ప్రపంచాన్ని కలచి వేసిందన్నారు. రైలు ప్రమాదంలో సుమారు 300మంది వరకూ మృత్యువాత పడగా, సుమారు మరో 2వేల మంది గాయాల పాలు కావటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాల్లో ధైర్యాన్ని నింపేందుకు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వాలతోపాటు, స్థానికులు కృషి చేయాలన్నారు. ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రమాదం ఘటన సమాచారం తెలియగానే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రెడ్‌క్రాస్ వలంటీర్లను అప్రమత్తం చేసి విపత్తుల నిర్వహణ, ప్రథమ చికిత్సల్లో శిక్షణ పొందిన వలంటీర్లను పంపి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. రెడ్‌క్రాస్ అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారని, ఆహారం, పాలు పంపిణీ చేశామన్నారు. క్షతగాత్రుల కోసం 500మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయటం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బీ.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులు టీ.శేష సాయి, జేఎంవీ ప్రసాదరావు, కొవ్వూరు వెంకట రెడ్డి, పరమేశ్వరరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది ఉన్నారు.

కొవ్వొత్తులతో నివాళులు

ఏలూరు (టూటౌన్): మోదీ ప్రభుత్వం రైల్వే ప్రయాణికుల భద్రతను విస్మరిస్తోందని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. స్థానిక పవరుపేట రైల్వేస్టేషన్ వద్ద పార్టీ ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఒడిశా కోరమండల్ రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలియజేస్తూ సోమవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పీ.కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రవి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతీయ రైల్వే వ్యవస్థ చాలా పెద్దదని, అటువంటి రైల్వేను బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరించిందని విమర్శించారు. రైల్వేలో సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వల్లే ఒడిశా రైలు ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కోరమండల్ రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తును చేసి భవిష్యత్తులో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీ.రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు వీవీఎన్ ప్రసాద్, నాయకులు ఎం.ఇస్సాక్, ఏసుబాబు, సుదర్శన్, నారాయణ,కే. సత్యనారాయణ పాల్గొన్నారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రెజ్లర్లకు సంఘీభావం

ఏలూరు (టూటౌన్): భారత రెజ్లర్లు ఢిల్లీలో నెలరోజులుగా చేస్తున్న న్యాయపోరాటానికి సంఘీభావంగా భారత్ బచావో ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా లలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేసారు. ఏలూరు జిల్లా భారత్ బచావో కమిటీ, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, అభ్యుదయ సంఘాలు, అంబేడ్కర్ వాద సంఘాలు, బహుజన వాద సంఘాలు సంయుక్తంగా ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణిపూర్లో నిర్వహిస్తున్న అల్లర్లను అదుపు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లిప్త వైఖరిని ఖండించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో ఏలూరు జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పాముర్వీంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజనాల రామ్మోహనారావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్, సీపీఐకు చెందిన అడ్డగర్ల లక్ష్మి ఇందిర, జి.స్వాతి, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు కాపుదాసి రవికుమార్, మత్తే బాబీ, సాకే రాజేంద్ర ప్రసాద్, గంటా రాజశేఖర్, ఉప్పు మురళీకృష్ణ, సాకే బాబు రాజేంద్రప్రసాద్, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంకెం సత్యప్రసాద్ కుటుంబ సభ్యులు

ఏలూరు (టూటౌన్): అధికారులు కులధ్రువీకరణ పత్రం జారీ చేయకపోవడంతో తాను, తన కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నామని కామవరపు కోట మండలం కె.కోట గ్రామానికి చెందిన అంకెం సత్యప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. తాము నాయకాస్ (ఎస్టీ) కులానికి చెందిన వారిమని గతంలో తనకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఇచ్చారని ఆయన తెలిపారు. తాజాగా తన కుమారుడికి చదువు నిమిత్తం ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా రకరకాల కారణాలతో ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ పథకం ఏదైనా పొందాలంటే తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారని చెప్పాడు. దీనిపై కలెక్టర్ స్పందించి కిందిస్థాయి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలంటూ విజ్ఞప్తి చేశాడు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేసారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	28	కంద	40
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	38	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	09
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	09
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	29
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

చెరువులను రజకులకు అప్పగించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కట్లయ్య కోరారు. ఈ సందర్భంగా సమావేశం తీర్మానాలను ఆయన వివరించారు. చెరువులపై రజకులకు శాశ్వత హక్కు కల్పించాలని, విశ్రాంతి భవనాల మరమ్మతులకు రూ.3లక్షలు నిధులు కేటాయించాలని కోరారు. ఆక్రమణలో ఉన్న రజకుల చెరువులను సర్వే చేయించి తిరిగి సంఘాలకు అప్పగించాలని కోరారు. అపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న రజక వృత్తిదారులకు శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వాలని రజక సమావేశంలో తీర్మానించారు. ప్రతి మూడు నెలలకొకసారి రజక సంక్షేమ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వితాల శ్రీనివాస్,యలమంచిలి నాగేశ్వ, లక్ష్మీప్రసన్న, ఎల్ సుబ్బయ్య, జువ్వలపాలెం సత్యనారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

స్పందనలో 236 అర్జీల స్వీకరణ

ఏలూరు(మెట్రో): సోమవారం ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో స్పందనలో 236 అర్జీలు వచ్చినట్లు జిల్లా రెవిన్యూ అధికారి ఎవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి జెడ్పీ సీఈవో రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డ్వామా పీడీ రాము, డీఎల్‌ఓ రమణలతో కలిసి డీఆర్‌ఓ జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 236 అర్జీలు వచ్చాయని తెలిపారు.

అక్రమ చెరువుల తవ్వకాలు నిలుపుదల చేయాలి

ఏలూరు (టూటౌన్): అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు నిలుపుదల చేసి మండవల్లి మండలం కానుకొల్లు దళితపేటను కాపాడాలంటూ సీపీఎం, ఏపీ రైతు సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండవల్లి మండలం కానుకొల్లు దళిత పేట కాలనీని ఆనుకుని ఉన్న పంట పొలాలను అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, మాల మహాసేన జాతీయ కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, సీఐటీయూ నాయకులు రాయగిరి రాము, యల్లమెల్లి మరియరాజు, కోసూరి మాణిక్యాలరావు,పి.జోసెఫ్,జువ్వనపూడి మరియమ్మ, యల్లమిల్లి కళ్యాణి పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు ఏలూరు, ... కాపురస్తుడు తోట కోదండ వెంకటసత్యనారాయణ రావు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు తెలియ చేయునది ఏమనగా వారి భార్య తోట అంజని దేవి ... రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్టరీ కాబడిన పార్టీషను దస్తావేజు నెం.1888/2015ను ది.27-05-2023 తేదిన ... నిమిత్తం సబ్ - రిజిస్ట్రారు ఆఫీసుకు వెళుతుండగా [illegible] ... సాధారణ ప్రజానీకానికి సమాచారము నిమిత్తం ఈ విషయం తెలియపర చడమైనది.

స్థలం: ఏలూరు
తేది: 05.06.2023

కె.కృష్ణమా చార్యులు
న్యాయవాది, ఏలూరు
సెల్:94401 18456

విద్యార్థులతో నైపుణ్య హరిత హారం ప్రతిజ్ఞ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన జన్ భాగిధరి జీ20 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టీటీడీసీలోని స్కిల్ కాలేజిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీ రావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్ భాగిధరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో నైపుణ్య హరిత హారం ప్రతిజ్ఞ చేయించారు.

కాలువల మరమ్మతులు చేపట్టాలి

ఏలూరు (టూటౌన్) : వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరి రైతులకు సాగునీటిని అందిస్తున్న గుమ్మడిపల్లి పెదవాగు ప్రాజెక్టు, కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు కింద ఆంధ్రాలో ఉన్న మేడేపల్లి, రామవరం, కొమ్ముగూడెం, దాచారం గ్రామ పంచాయతీలలోని 15 వేల ఎకరాల భూములకు సంబంధించి పెదవాగు ప్రాజెక్టుకు కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో మట్టి పూడికలు, గండ్లు పడి నీరు వృథాగా పోతోందన్నారు. దీంతో రైతుల భూములకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ధర్నా అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నేత గడ్డాల ముత్యాలరావు, పార్టీ వేలేరుపాడు మండల కార్యదర్శి సోయం చంద్రరావు, డివిజన్ మండల నాయకులు కారం సత్యవతి, మేడేపల్లి సర్పంచ్, ఎంపీటీసీ కట్టం రాంబాబు, తుర్రం తమ్మయ్య, కట్టం వీరాస్వామి పాల్గొన్నారు.